క్లుప్తంగా

విద్యతో పాటు కళా నైపుణ్యం



ర్యాలిలో ఉత్తమ విద్యార్థినులను సత్కరిస్తున్న శ్యామ్, మోహిత్

కొత్తపేట: విద్యార్థులు విద్యతో పాటు ఇష్టమైన కళల్లో నైపుణ్యం సాధించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందాలని ప్రముఖ మనస్తత్వవేత్త చింతా శ్యామ్‌కుమార్ (శ్యామ్ జాదూగర్) అన్నారు. శాస్త్రీయ నృత్యంలో విశేష ప్రతిభ కనబరుస్తూ, ప్రముఖుల మన్ననలు పొంది, ఇటీవల పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన పెండం నాగేశ్వరి, కోపెల్ల భారతిలను ర్యాలి అను సకల కళల ఉచిత శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అన్నపూర్ణ డే కేర్ హోమ్‌లో అభినందనం దించారు. శ్యామ్ జాదూగర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు అన్నపూర్ణ, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘ అధ్యక్షుడిగా శివరామకృష్ణ



నూతనంగా ఎన్నికైన రజక సంఘం కమిటీ

అంబాజీపేట: పుల్లేటికుర్రు, ఇరుసుమండ గ్రామాల శ్రీలక్ష్మీగణపతి రజక సంఘ అధ్యక్షుడిగా కొత్తపల్లి శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పుల్లేటికుర్రులో రజక సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నేదునూరి శ్రీను, ఉపాధ్యక్షుడిగా మానేపల్లి నాగచంద్రరావు, జాయింట్ సెక్రటరీగా పి.రామసత్యనారాయణ, ట్రెజరర్‌గా నేదునూరి వెంకటరమణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు శివరామకృష్ణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి రజకులకు వచ్చే సంక్షేమ పథకాలన్ని అందేలా చూస్తానన్నారు. సమావేశంలో రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

భగవంతుని చేరాలంటే ధ్యానమే మార్గం



శ్రీకృష్ణునికి విశేష పూజలు నిర్వహిస్తున్న ప్రభూజీ

అయినవిల్లి: భగవంతుడిని చేరాలంటే నిరంతరం దైవ ధ్యానంలో ఉండాలని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్‌లో శ్రీకృష్ణ భగవానునికి అత్యంత వైభవంగా పూజలు జరిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. హరినామ సంకీర్తనలు, తులసిపూజ, శ్రీలక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. మద్భాగవత ప్రవచనం నిర్వహించారు. అనంతరం భక్తులకు బొల్లంగి రామకృష్ణ, బచ్చు నాగేశ్వరరావులు అందించిన ఆర్థిక సాయంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

'రామం'కు మ్యాన్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం



చెన్నైలో జీహెచ్‌పీయూ మ్యాన్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు అందుకుంటున్న రామం

కొత్తపేట: స్థానిక పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం)కు అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) మ్యాన్ ఆఫ్ ఎక్సెలెన్సీ అవార్డును ప్రదానం చేసింది. కొత్తపేటకు చెందిన రామం వృత్తి రీత్యా వివిధ ఆలయాల్లో అర్చకుడిగా చేస్తారు. రామం దేశ, విదేశాల కరెన్సీ, నాణేలు, డాలర్లు, రకరకాల వస్తువులు, నవరత్నాలు, పూసలు, రుద్రాక్షలు వంటి అరుదైన వాటితో పాటు 125 సంవత్సరాల పంచాంగాలు, అరుదైన మొక్కలు సేకరణ ఆయన ప్రవృత్తి. రామం ప్రతిభ, సేవలను గుర్తించిన జీహెచ్‌పీయూ శనివారం చెన్నై మైలాపూర్ భారతీయ విద్యాభవన్‌లో బెంగళూరు వేదిక్ జ్యువెలరీ అధినేత అమిత్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ఎక్సెలెన్సీ అవార్డును రామం అందుకున్నారు. రామంను స్థానిక ప్రముఖులు అభినందించారు.

వైద్యుడు.. పునర్జన్మనిచ్చే దేవుడు

- కరోనా వేళ ప్రాణాలు పణంగా పెట్టిన వైనం
- రేపు జాతీయ వైద్యుల దినోత్సవం



కొత్తపేట సీహెచ్‌సీలో రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ హనుమాన్

కొత్తపేట: వైద్యో నారాయణోహరి అన్నారు పెద్దలు.. అంటే వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. వివిధ మతాల వారు తమ దేవుడినే ఆరాధిస్తారు. కానీ అన్ని మతాల వారు చేతులెత్తి మొక్కేది వైద్యుడికే. అందుకే వైద్యుల మీద ఎన్ని విమర్శలు వచ్చినా, అనారోగ్యంతో ఉన్నప్పుడు వైద్యుల వద్దకే పరుగులు తీస్తుంటారు. అయితే కాసులకు కక్కుర్తిపడే వైద్యులు పదుల సంఖ్యలో ఉంటే, వైద్య వృత్తిని దైవంగా భావించే వైద్యులు వేలల్లో ఉన్నారు. బెంగాల్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు భారతరత్న డాక్టర్ బిదన్ చంద్రారాయ్ వైద్య వృత్తిలో పేరు ప్రఖ్యాతులు పొందారు. వైద్య రంగ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన వైద్య కల్పనకు విశేషమైన కృషి చేశారు. 1882 జూలై 1న జన్మించిన ఆయన 1962 జూలై 1న కన్నుమూశారు. అప్పటి నుంచీ ఆయన సేవలను స్మరించుకుంటూ ఆయన సంస్మరణార్థం ఏటా జూలై 1న ప్రభుత్వం 'జాతీయ వైద్యుల దినోత్సవం'ను నిర్వహిస్తోంది. వైద్యులు ఆ మహనీయుని స్ఫూర్తితో వైద్య రంగంలో రాణిస్తున్నారు.

జన హృదయాల్లో కొలువైన వైఎస్సార్..

దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యుడన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆయన ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టక ముందు వరకూ ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి ఖరీదైన వైద్యం ధనికులకే పరిమితం. పేద, సామాన్య వర్గాలకు ఏ రోగం వచ్చినా ప్రభుత్వ వైద్యమే గతి. ఆయన అధికారం చేపట్టి ఆరోగ్యశ్రీ, 108, 104 వైద్య సేవలను ప్రవేశపెట్టారు. ఆయన పుణ్యమా పేద, మధ్యతరగతి ప్రజలు కూడా ధనికులతో సమానంగా కార్పొరేట్ వైద్య సేవలు పొందుతున్నారు. అతి ఖరీదైన బైపాస్ సర్జరీ వంటి శస్త్ర చికిత్సలతో పునర్జన్మ పొందారు. వైఎస్ డాక్టర్ కావడం వలనే పై పథకాల గురించి ఆలోచన చేయగలిగారు. ఆ వైద్య సేవలతో నేటికీ ప్రజలు వైఎస్‌ను తమ హృదయాల్లో పెట్టుకుని గుర్తు చేసుకుంటారు.

కరోనా సమయంలో తెగువ చూపిన డాక్టర్లు

కరోనా విపత్తులో వైద్యులు చూపిన తెగువ మనం కళ్లారా చూశాం. ప్రాణాలకు తెగించి ఎందరో ప్రాణాలు నిలబెట్టిన ప్రాణదాతలు వైద్యులు. ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినా వెనకడుగు వేయకుండా వైద్య సేవలు అందించారు. ఒక విధంగా కరోనాపై యుద్ధంలో కీలకపాత్ర పోషించారు. వేలాది మంది ప్రాణాలను రక్షించారు. రోగుల శరీరానికి వచ్చిన వ్యాధులకే కాకుండా మనోవ్యాధికి, ఆందోళనకు చికిత్స అందించి వారిలో మనో ధైర్యాన్ని నింపుతున్నారు.

వైద్య విద్యకే యువత మొగ్గు

గతంలో వైద్య విద్య అభ్యసించాలంటే సామాన్యులకు సాధ్యమయ్యేది కాదు. అయితే ఇప్పుడు వైద్య కళాశాలలు పెరగడం, వైద్య రంగంలో అధునాతన విధానాలు అందుబాటులోకి రావడంతో అనేక మంది యువత వైద్య విద్య చదివేందుకు ముందుకు వస్తున్నారు. గతంలో ఎంబీబీఎస్‌కే పరిమితమైన యువత ఇప్పుడు పీజీలు కూడా చేస్తున్నారు. దీంతో దాదాపు అన్ని ప్రాంతాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులోకి వచ్చారు. రాష్ట్రంలో మరింత మంది వైద్యులను తయారుచేసే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయతలపెట్టింది. దానిలో భాగంగా ఆ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కొత్తగా 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'విలేజ్ హెల్త్ క్లినిక్ -ఫ్యామిలీ ఫిజీషియన్' పథకం చక్కని అవకాశాలు కల్పించింది. వైద్యులుగా ఈ విభాగంలోకి అనేకమంది కొత్త వైద్యులు వచ్చారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ వారికి వైద్య సేవలు అందించారు. దాంతో గ్రామీణ ప్రాంతాలకు వైద్యం చేరువయింది. మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేకుండా అనేక వ్యాధులకు వైద్యం అందించారు.

వైద్య వృత్తి సంతృప్తికరం



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది. ఒక డాక్టర్‌గా ఈ వృత్తిలో సంతృప్తి లభిస్తుంది. డాక్టర్ కావాలనేది మా తల్లిదండ్రుల కోరిక. ఆ మేరకు కష్టపడి చదివి డాక్టర్ అయ్యాను. ప్రైవేట్ ఆస్పత్రులు కాదని పేదలు వచ్చే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలని నిర్ణయించుకున్నాను. ప్రభుత్వ ప్రోత్సాహంతో పేద ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాను.

– జి.దుర్గాప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, కొత్తపేట

వైద్య సేవ గొప్ప వరం



ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. మనిషికి ఎంత సంపద ఉన్నా దాన్ని అనుభవించే ఆరోగ్యం లేకపోతే ఎంత సంపద ఉన్నా వృథాయే.అనారోగ్యంతో బాధపడేవారిని ప్రమాదస్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యులకే ఉంది. పవిత్రమైన ఈ వైద్య వృత్తిలోకి రావడం గొప్ప వరంగా భావిస్తున్నాం. ప్రజలకు ఆరోగ్య సేవ చేస్తున్నాం అనే భావనతో పనిచేస్తున్నాం.

– ఎస్.శ్రీదివ్య, వైద్యాధికారి, పీహెచ్‌సీ, అవిడి

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి సంతాపం



ఏడుకొండలు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: మండలంలోని గూడపల్లి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మోకా సురేష్ సోదరుడు ఏడుకొండలు మరణించారు. ఏడుకొండలు కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, ఆయన తనయుడు గొల్లపల్లి శ్రీధర్ పరామర్శించారు. ఏడుకొండలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడి సహదేవ్, పున్నం నాగేశ్వరరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

మలికిపురం: సామ్యవాదం, లౌకికవాదం పదాలను రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలె మాట్లాడడంపై రాజోలు నియోజకవర్గ చైతన్య సమితి, వివిధ ప్రజా సంఘాలు తీవ్ర అభ్యంతరం తెలియజేశాయి. విశ్వేశ్వరాయపురం అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వివిధ ప్రజా సంఘాలు పాల్గొని నిరసన వ్యక్తం చేశాయి.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

అయినవిల్లి: ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. ఇంజరం గ్రామానికి చెందిన వింటి రాజు ఆదివారం తాగి లారీని నడుపుతుండగా బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించినప్పుడు అతని రక్తంలో 165 మిల్లీగ్రాముజీ, అలాగే కొత్తపేటకు చెందిన మెట్టి శ్రీను బైక్‌పై డ్రింక్ చేసి వెళుతుండగా బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా 115 మిల్లీ గ్రాముల ఆల్కహాల్ ఉన్నట్లు గుర్తించారు. వీరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు.

మత్స్య సంపదను ప్రోత్సహించేలా ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శివరాక్

మామిడికుదురు: గోదావరి నుంచి వచ్చే మత్స్య సంపదకు మరింత విలువ కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని గోదావరి ఫిష్ ఫార్మర్స్ చైర్మన్ కొల్లు శివరాక్ తెలిపారు. పాశర్లపూడిలోని శ్రీరామ్‌పేటలో ఆదివారం గోదావరి ఫిష్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యత్వంపై అవగాహన కార్యక్రమం జరిగింది. సొసైటీని మరింత బలోపేతం చేసి దాని ద్వారా మత్స్యకారులకు ఆర్థికంగా మరింత చేయూతనందించే దిశగా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్క మత్స్యకారుడు సొసైటీలో విధిగా సభ్యత్వం తీసుకుని దీనిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పొన్నమండ దుర్గాప్రసాద్, పొన్నమండ ధర్మరాజు, ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, సొసైటీ సీఈఓ తరుణ్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభల సన్నాహక సమావేశం



అంతర్వేదికరలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సత్తిబాబు

సఖినేటిపల్లి: సీపీఐ మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి మహాసభల నిర్వహణకు జనసమీకరణ కోసం ఆదివారం అంతర్వేదికర గ్రామంలో నాయకులు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి ఇంటి వద్ద పార్టీ మండల కార్యదర్శి గెడ్డం ప్రభాకర్ అధ్యక్షతన జరిగినపై సన్నాహక సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సత్తిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా కేశవశెట్టి మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడిగా జూలై 19న అమలాపురంలో జరిగే బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్టు జిల్లా కార్యదర్శి సత్తిబాబు పేర్కొన్నారు. జూలై ఒకటి నుంచి ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జనసమీకరణకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి చెల్లుబోయిన తాతారావు, నాయకులు దొండపాటి చిట్టిరాజు, జంపన ప్రసాద రావు, దీపాటి గంగాజలం, దొండపాటి భానోజీ పాల్గొన్నారు.

నాట్లు... మరీ లేటు



గంగలకుర్రులో నారుమడి సిద్ధం చేసిన రైతు

అంబాజీపేట: ఈ ఏడాది ఖరీఫ్ నాట్లు ఆలస్యమయ్యాయి. ముందస్తు ఖరీఫ్ సాగు ఎలా ఉన్నా, కనీసం ఆగస్టు నెలాఖరు నాటికి నాట్లు పూర్తవుతాయా అన్న సందేహం రైతుల్లో ఏర్పడింది. ఖరీఫ్ సాగు త్వరితగతిన చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించినా వరుణుడు కరుణించలేదు. పంట కాల్వలు కనికరించలేదు. పంట కాల్వలు వదిలి నెల రోజులు కావస్తున్నా చుక్క నీరు సాగుకు వినియోగించుకునే స్థితి లేకపోవడంతో దమ్ము పనులు ప్రారంభం కాలేదు. ఎట్టకేలకు గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్నారు. మరో వారం రోజులకు నారుమడులు సిద్ధమయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పుడిప్పుడే నారుమళ్ల కోసం దమ్ము పనులు చేపడుతున్నారు. వారం పది రోజులకు నారమడులు సిద్ధం చేసి విత్తనాలు నాటే అవకాశం ఉంది. నారు పోసిన తరువాత సుమారు 15 రోజుల వరకూ నాట్లు వేసే అవకాశం ఉండదు. ఆగస్టు నెలాఖరు వరకూ నాట్లు కొనసాగవచ్చని రైతులు చెబుతున్నారు.

పలువురికి ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.11 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలం కొమరాజులంక గ్రామానికి చెందిన యార్లగడ్డ చిన్నబాబు (40), రెండు సంవత్సరాలు నుంచి పక్షవాతంతో ఒక చెయ్యి, కాలు పని చేయక ఇంటి దగ్గరే ఉంటున్నారు. భార్య పనికి వెళ్లి ఇంటిని పోషిస్తుంది. వైద్యానికి, మందులకు డబ్బులు లేక స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. కొమరాజులంకలో చిన్నబాబు ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.11 వేల చెక్కు అందజేశారు.

స్నేహితుడికి రూ.57 వేల సాయం

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 1979–80 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్న తమ సహచర విద్యార్థికి ఆర్థిక సాయం అందించి స్నేహభావం చాటుకున్నారు. బెల్లంపూడి గ్రామానికి చెందిన వర్ధినీడి సత్యసాయిబాబు ఇటీవల అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థులు 23 మంది కలిసి తమ వంతు సాయంగా రూ.57,750ను సత్యసాయిబాబుకు ఆదివారం పి.గన్నవరంలో అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎస్పీఎఫ్ రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ కొండా నర్సింహారావు, పూర్వ విద్యార్థులు బొరుసు చంద్రశేఖర్, ముంగండ సుబ్బారావు, ఆచంట వెంకన్నబాబు, ఆరుమిల్లి సాయిబాబు, మేకం దేవయ్యనాయుడు, కడలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపూడిలో అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మృతుని కుటుంబానికి..

మామిడికుదురు: నగరం గ్రామంలోని భారత్‌నగర్‌కు చెందిన దేవ పెద్దిరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన అతని కుటుంబానికి స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నేత నీతిపూడి గణేష్‌బాబు ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని మృతుని కుమారుడు అబ్రహం పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండును మృతుని భార్య సువర్ణకుమారికి అందించారు. ఆమెకు దుస్తులు అందించారు. కార్యక్రమంలో నీతిపూడి గణపతిరావు, దేవ ప్రసాద్, యాలంగి శేషగిరిరావు, దేవ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



కొమరాజులంకలో బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు



నగరంలో మృతుని భార్యకు బాండును అందించిన వైఎస్సార్ సీపీ నేత గణేష్‌బాబు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..



కుంపట్ల గోవిందరావు



రాణి శ్రీధర్



పేరిచర్ల వీఎస్ ఎస్ కుమార్‌రాజు

పి.గన్నవరం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ నియామకాలు జరిగాయి. పి.గన్నవరం మండలం కె.ముంజవరం గ్రామానికి చెందిన కుంపట్ల గోవిందరావు నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా, ఊడిమూడికి చెందిన రాణి శ్రీధర్ లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడిగా, ఆర్.ఏనుగుపల్లికి చెందిన పేరిచర్ల వీఎస్ఎస్ కుమార్‌రాజు ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. వీరిని పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సిఫారసు మేరకు ఈ నియామకాలు జరిగాయి.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో చేపలు స్వాహా

అల్లవరం: గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ద్వారా అల్లవరం మండలంలోని 14 గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు అందిస్తున్న బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు అడుగంటడంతో కొందరు అందులోని చేపలను పట్టుకుని సొమ్ము చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమలాపురం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ప్రధాన కాలువలపై వంతెనల నిర్మాణం చేపట్టడంతో కాలువలకు సాగునీరు రావడం ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో బోడసకుర్రు ప్రాజెక్టులో నీటి కొరత వచ్చింది. వేసవిలో ఎక్కువ మొత్తంలో నీటిని శుద్ధి చేసి తాగునీరు పంపిణీ చేయడంతో చెరువులో నీరు అడుగంటాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు లేకపోవడంతో గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు చెరువులోని చేపలపై కన్నేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సహకారంతో చెరువులో చేపలను రాత్రికి రాత్రే పట్టుబడి చేయించి సొమ్ము చేసుకున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో (2014–19) ఉన్నప్పుడు చెరువులోని చేపలను పట్టుకుని అమ్ముకునేందుకు అప్పటి డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో పంచాయతీలో వేలం నిర్వహించారు. వేలంలోని నిబంధనల మేరకు 8 అడుగుల లోతులో చేపలను వేటాడుకోవాలని నిర్ణయించారు. ఆ మేరకే చేపలను వేటాడుకుని విక్రయించారు. అప్పుడు మిగిలిన చేపలు బాగా పెరిగి పెద్దవయ్యాయి. ఇటీవల చెరువులో నీరు తగ్గడంతో చేపలున్నట్టు గుర్తించిన నాయకులు వాటిని పట్టుబడి చేయించి పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారు. చెరువులో నీరు తగ్గడం వారి పాలిట వరంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆకట్టుకున్న జంతువుల ప్రదర్శన



మేలురకపు జాతుల ఆవులు

యానాం: పశుగణాభివృద్ధి, పశుసంక్షేమశాఖ, పుదుచ్చేరి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన పశువులు, కోళ్ల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో గ్రామాల నుంచి వివిధ రకాల అరుదైన మేలు జాతి ఆవులు, గేదెలు, పెయ్యలు, పౌల్ట్రీ విభాగంలో కోళ్లు, కోడిపుంజులు, గొర్రెలు, మేకలు, పెంపుడు శునకాలు, పిల్లులను ప్రదర్శించారు. పశువైద్యాధికారి డాక్టర్ వి.కౌమారిణి మాట్లాడుతూ పశువుల బలం, ఆరోగ్యం, సంరక్షణ, అందంతో పాటు వాటి జాతి లక్షణాలను ప్రదర్శించడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. అనంతరం ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన పశువులు, జంతువులకు బహుమతులను ఆయా యాజమాన్యాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డాక్టర్ చెక్కపల్లి శ్రీరామ్, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో సత్తెమ్మ తల్లి

ముమ్మిడివరం: ఆషాఢమాసం సందర్భంగా చెయ్యేరు గున్నేపల్లి సత్తెమ్మ తల్లిని ఆదివారం శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. భోగిశెట్టి తిరుమల పల్లంరాజు, సాధనాల పండు సమకూర్చిన వివిధ రకాలైన పండ్లు, కూరగాయలతో శాకంబరిగా అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గాలిదేవర జగదీష్, గనిశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



అధ్వానంగా మారిన కుందాలపల్లి రోడ్డు

పి.గన్నవరం: మండలంలోని పప్పులవారిపాలెం నుంచి కుందాలపల్లి గ్రామానికి వెళ్లే రహదారి నరకప్రాయంగా మారింది. కొద్దిపాటి వర్షానికే నీట మునిగి పెద్ద, పెద్ద గుంతలతో చెరువును తలపిస్తోంది. దీంతో ఈరోడ్డుపై ప్రయాణించే విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ధ్వంసమైన రోడ్డును ఆధునీకరించాలని ప్రజా ప్రతినిధులను కోరుతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుందాలపల్లిలో సుమారు 600 మంది నివసిస్తున్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నుంచి కుందాలపల్లికి వెళ్లే 1.2 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈరోడ్డుపై వెళ్లేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతోంది. ద్విచక్ర వాహనాలు జారిపోతుండడంతో ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. వర్షం వస్తే సైకిళ్లపై పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 80 మంది విద్యార్థులు ఈ గ్రామం నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నారు. వర్షం వస్తే గ్రామంలోకి స్కూలు బస్సులు కూడా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా తమ గ్రామానికి రోడ్డును ఆధునీకరించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కుందాలపల్లి రోడ్డును ఆధునీకరించి తమ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరం

మామిడికుదురు: నగరం గ్రామంలోని తాడివారిమెరక రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అడుగుకో గుంత అన్న విధంగా ఈ రోడ్డు పరిస్థితి మారిందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఒక మాదిరి వర్షానికే ఆ గుంతల్లో నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో పడి పలువురు ప్రమాదాల బారిన పడ్డారని తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని ఎంతో కాలంగా వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు దుస్థితిని అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించి దీని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



అధ్వానంగా ఉన్న తాడివారిమెరక రోడ్డు